## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెనమలూరు:** యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తులుపుతూ యనమలకుదురు ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా శ్రీకృష్ణాకాలనీ, చౌడేశ్వరకాలనీ, తాడిగడప డొంక రోడ్డు, రావి సుబ్బయ్య కాలనీ, ఎస్‌కెఎల్ కాలనీ, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు సహకరించాలని కోరారు.

### కానూరులో పింగళి వెంకయ్య జయంతి



**పెనమలూరు:** జాతీయ జెండా రూపకల్పి పింగళి వెంకయ్య జయంతి కానూరులో శుక్రవారం ఘనంగా చేశారు. కానూరు అశోక్ జిమ్, జిల్లా నెహ్రూ యువ కేంద్రం, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో అశోక్ జిమ్‌లో జయంతి కార్యక్రమం నిర్వహించారు. పింగళి ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పింగళి వెంకయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దిశ ఎస్‌ఐ ఎం ద.వరలక్ష్మి, స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు తాళ్లూరి శారద, బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదీ రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**రామవరప్పాడు:** విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని మండల పరిషత్ పాఠశాలను శుక్రవారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. హాజరు రిజిస్టర్లు, నోట్ పుస్తకాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహర పదార్థాలు అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిశుభ్రమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ కోనేరు పెదబాబు, నాయకులు కొమరవల్లి కిషోర్ పాల్గొన్నారు.

### గ్రామ స్థితిగతులపై అవగాహన



**కంకిపాడు:** గ్రామ స్థితిగతులను సమగ్రంగా వివరిస్తూ వ్యవసాయ విద్యార్థులు గ్రామ పటాన్ని ప్రదర్శించారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి గ్రామీణ పనులు అవగాహన-అనుభవ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన కేఎల్ యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు శుక్రవారం గ్రామ స్థితిగతులను వివరిస్తూ పటాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని భూ కమతాలు, ప్రధాన కార్యాలయాలు, సంస్థలు, వ్యవసాయ దిగుబడులు, సాగులో ఎదుర్కొన్న ఇబ్బందులు, గ్రామానికి అనుబంధంగా ఉన్న గ్రామాల జాబితా, చెరుకు దిగుబడులు గణాంకాల సమీక్షను వివరిస్తూ పటాన్ని రూపొందించారు. గ్రామంలోని పరిస్థితులను అన్నింటినీ రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు వి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, వి.మహేష్, జి.హర్షసాయి, ఎం.నాగమహేంద్రరెడ్డి, ఎం.జనార్ధన్‌రెడ్డి, డి.సాకేత్, షేక్ షాకిర్ అక్రం, ఎం.కృష్ణప్రసాద్, యు.సాయిరాం, సయ్యద్ సాహైల్ పాల్గొన్నారు.

### భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** టీ తాగేందుకు బయటకు వెళ్లిన తన భర్త కనిపించకుండా పోయాడని భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ బంక బుల్లాబ్బాయ్ వీధికి చెందిన చింతల అనసూయ, సూర్యనారాయణ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా ఇద్దరికి వివాహాలయ్యాయి. గత నెల 29వ తేదీ ఉదయం సూర్యనారాయణ టీ తాగేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారిని, తోటి పని వారికి అడిగినా ప్రయోజనం లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

- తల్లిపాల వారోత్సవాలు
- ర్యాలీలు, అవగాహన సదస్సులు



వణుకూరులో తల్లిపాల వారోత్సవంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**పెనమలూరు:** తల్లిపాల వారోత్సవాలు పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. వణుకూరులో తల్లిపాల వారోత్సవంలో భాగంగా శుక్రవారం వణుకూరు 3వ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కంకిపాడు ప్రాజెక్టు సీడీపీవో కే.బేబీసుకన్య మాట్లాడుతూ తల్లి పాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని అన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమన్నారు. బిడ్డకు ఆరునెలల పాటు తల్లి తన పాలు ఇవ్వాలని సూచించారు. బిడ్డకు డబ్బా పాలు తాగిస్తే నష్టం కలుగుతుందని వివరించారు. తల్లిపాలతో పోషకాలు బిడ్డకు అంది బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

**కంకిపాడు:** తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం అని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కంకిపాడు-5 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో సూపర్‌వైజర్ అన్నామణి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.లత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

**ఉయ్యూరు:** తల్లిపాలతో చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని కౌన్సిలర్లు కూరాడ వెంకటలక్ష్మి, బి.రమణ అన్నారు. ఉయ్యూరు సుందరం పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వివరించి, పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్యాణి వర్మ, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, పద్మజారాణి పాల్గొన్నారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని ర్యాలీ చేపట్టారు.



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది

**గన్నవరం రూరల్:** తల్లి పాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు సీడీపీవో వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని ముస్తాబాద సెక్టార్‌లోని వివిధ గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, ప్రచార ర్యాలీలు జరిగాయి. డబ్బా పాలు వద్దు, తల్లి పాలే ముద్దు అని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తల్లులతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లి పాలేనని చెప్పారు. సూరంపల్లి, చనుపల్లివారిగూడెం, ముస్తాబాద గ్రామాల్లో వారోత్సవాలు నిర్వహించారు.

**నున్న(విజయవాడరూరల్):** తల్లిపాలను బిడ్డకు ఆరునెలల పాటు ఇవ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమ్య తల్లులకు సూచించారు. శుక్రవారం బోడపాడులోని అంగన్‌వాడీ కేంద్రం-1లో పది అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు తాగించడం వలన తల్లిపాలలో సహజమైన రోగనిరోధకశక్తి వల్ల బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లులకు రొమ్ముక్యాన్సర్ వ్యాధి రాదన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ ప్రతి తల్లీ బిడ్డకు పాలు ఇవ్వడం వలన ప్రేమానురాగాలు ఉంటాయన్నారు. తప్పనిసరిగా ఆరు నెలల పాటు తల్లి బిడ్డకు పాలు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** బిడ్డ పుట్టిననాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. వెల్దిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. గర్భవతిగా ఉన్నప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకుంటూ రెండు సవత్సరాల వరకు బిడ్డకు తల్లిపాలను ఇవ్వాలని పేర్కొన్నారు. తల్లి పాలు తాగడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు సుందరంపేటలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, రమణ



ముస్తాబాదలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న తల్లులు, ఉద్యోగులు



బోడపాడులో మాట్లాడుతున్న సీహెచ్ఓ రమ్య, సూపర్‌వైజరు స్వర్ణకుమారి



వెల్దిపాడులో మాట్లాడతున్న గన్నవరం సీడీపీవో వెంకటలక్ష్మి

### 5న పేరంటాలమ్మ శ్రావణమాస పూజలు

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 5 నుంచి శ్రావణ మాస విశేష పూజలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా నిర్వహించే పూజలు సెప్టెంబరు 3 వరకూ జరుగుతాయన్నారు. ఈ నెల రోజులు పరోక్షముగా పూజలు జరుగుతాయని, మాసాంతరం అమ్మవారి ప్రత్యేక ప్రసాదం, కుంకుమ, అక్షింతలు భక్తులకు అందజేస్తామని వివరించారు. స్వయంగా రాలేని భక్తులకు పోస్టు, కొరియర్ ద్వారా ప్రసాదము అందజేయనున్నట్లు తెలిపారు.

### కిచెన్ గార్డెన్ పనుల నిర్వహణ

**ఉయ్యూరు:** ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో కిచెన్ గార్డెన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో పాఠశాల ఖాళీ స్థలంలో ప్రొక్లెయిన్‌తో పిచ్చిమొక్కలు తొలగించి నేలను చదును చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుధారాణి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కొలసాని రవికుమార్, రాజేష్, పినమాల నాగ కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం జ్యోత్స్నాదేవి పాల్గొన్నారు. చదును చేసిన స్థలంలో మొక్కలు నాటుతామని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవికుమార్ తెలిపారు.

### సొసైటీ మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మృతి

**నున్న(విజయవాడరూరల్):** నున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భీమవరపు సుబ్బారెడ్డి (చుక్కమ్మ గారి సుబ్బారెడ్డి) (86) శుక్రవారం నున్న గ్రామంలో ఆయన స్వగృహంలో గుండె పోటుతో మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భార్యం గతంలోనే మరణించింది. సుబ్బారెడ్డి 1987 జూన్ నుంచి మూడు సంవత్సరాల పాటు నున్న సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. గొల్లపూడి పంపింగ్ స్కీమ్ ప్రెసిడెంటుగా కూడా సేవలందించారు. సుబ్బారెడ్డి పార్థివదేహానికి పలువురు రాజకీయపార్టీల నాయకులు, గ్రామపెద్దలు శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

**కమిషనర్ వెంకటేశ్వరరావు**



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

**ఉయ్యూరు:** పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని ప్రతి ఒక్కరూ విధిగా పరిశుభ్రత పాటించాలని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. మురుగు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల మందు పిచికారీ చేస్తున్నట్టు వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి సంతోష, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్గీకరణపై తీర్పు చారిత్రాత్మకం



ఉయ్యూరులో క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

**ఉయ్యూరు:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని ఎమ్మార్పీఎస్ నాయకులు, పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంపై ఉయ్యూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మిఠాయిలు పంచారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, ఫికోల్, ఉయ్యూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**గన్నవరం:** ఎమ్మార్పీఎస్ మూడు దశబ్దాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఎంఈఎఫ్ మండల ఉపాధ్యక్షుడు దేవరపల్లి ఏసుపాదం తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం ఎంఈఎఫ్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి మాట్లాడుతూ వర్గీకరణను త్వరితగతిన అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. సంఘ నాయకులు కొడాలి జోసఫ్, మందా వేణు బాబు, కొమ్మాని విజయప్రసాద్, నిడమర్తి నాగేశ్వరరావు, సతీష్‌కుమార్, యేసురత్నం, రాబర్ట్‌జాన్సన్, వల్లూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి బలవన్మరణం

- డబ్బులు కట్టకుండా వేధించారంటూ సెల్ఫీ వీడియో
- కంకిపాడు పీఎస్‌లో కేసు నమోదు



మృతుడు అఖిల్ పవన్

**కంకిపాడు:** డబ్బులు తీసుకున్న వ్యక్తులు తిరిగి కట్టకుండా వేధించటంతో ఓ యువకుడు బలవన్మరణం చెందిన ఘటనపై శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతుడు సెల్ఫీ వీడియో తీసి తన గోడును తన మిత్రులకు పంపటంతో ఈ ఉదంతం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుదే అఖిల్ పవన్ (28), మౌనిక భార్యాభర్తలు. వీరికి 2017లో వివాహం జరిగింది. ఒక పాప, ఒక బాబు సంతానం. అఖిల్ పవన్ కొద్ది రోజుల క్రితం వరకూ గుడివాడ సమీపంలోని బేతవోలులో తన కుటుంబంతో జీవించాడు. గుడివాడ కేంద్రంగా నడిచే ఓ బ్యాంకింగ్ సంస్థలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పామర్తి కృష్ణ, వీరంకి వంశీకుమార్ అఖిల్‌పవన్ వద్ద రూ.లక్ష, అతని స్నేహితుడు ప్రశాంత్ వద్ద రూ.54 వేలు, బి.కనకదుర్గ వద్ద రూ.18 వేలు తీసుకున్నారు. డబ్బులు అడిగితే ఎప్పుడు ఇచ్చావంటూ వేధింపులకు, గొడవలకు దిగారు. ఈ కారణంగా గత నెలలో ఉద్యోగానికి రాజీనామా చేసిన అఖిల్ పవన్ ఈనెల 1న స్వగ్రామమైన ప్రొద్దుటూరు వచ్చాడు. బయటకు వెళ్లి వస్తానని చెప్పిన అఖిల్ పవన్ అదే రోజు రాత్రి ప్రొద్దుటూరు పరిధిలోని గాయత్రీ విహార్ వెనుక గల శ్మశానవాటిక వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో తన చావుకు పామర్తి కృష్ణ, వీరంకి వంశీకుమార్ కారణమని, డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి తన మిత్రులకు పంపాడు. గ్రామంలో ఉన్న అతని మిత్రులు కుటుంబ సభ్యులకు విషయాన్ని చెప్పటంతో ఆ ప్రాంతానికి వెళ్లిన కుటుంబ సభ్యులకు స్పృహ తప్పి పడి ఉన్న స్థితిలో అఖిల్‌పవన్ కనిపించాడు. హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై మృతుడి భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

**కేసు నమోదులో తాత్సారం**

కేసు నమోదు విషయంలో తొలుత తాత్సారం జరగటంతో బాధిత కుటుంబ సభ్యులు కంకిపాడు పోలీసుస్టేషన్ వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. కంకిపాడు పోలీసులు బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఘటనపై ఎస్సీ, ఎస్టీ, ఇతర సెక్షన్‌లపై కేసులను నమోదు చేశారు. కంకిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

**మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి**



**కంకిపాడు:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కంకిపాడు లాకుల వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 9వ తేదీన హలో మాల-చలోఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని నినాదాలు చేశారు. చలో ఢిల్లీ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న పార్టీలకు గుణపాఠం చెబుతామన్నారు. అణగారిన వర్గాలు ఐక్యంగా ఉండాలని, విడిపోతే బలహీన పడి నష్టపోతారని రాజ్యాంగం పేర్కొందన్నారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. త్వరలో సంఘం జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి దళిత సంఘాలను కలుస్తారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని, అందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్రె చిట్టిబాబు, పెనమలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గోవాడ బెర్నాడ్‌షా, నాయకులు మధు, హరిబాబు, ప్రసాద్, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం

**వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి**



బిళ్లనపల్లిలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** ప్రస్తుత వాతవరణ పరిస్థితుల దృష్ట్యా దోమల ద్వారా వ్యాప్తి చెందే విష జర్వాలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. గ్రామంలో ఇటీవల ఓ వ్యక్తి మెదడువాపు సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పర్యటించిన అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి ప్రజలతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, తాగు నీటి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా నేతృత్వంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి జర్వాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. వారికి డెంగీ, డయేరియా, మలేరియా, రాపిడ్ టెస్ట్‌లను నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని సూచించారు. దోమల ద్వారా నివారణకు, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాజమండ్రి జోన్ ఏడీ బీఎల్ఎన్ కుమార్, జిల్లా మలేరియా అధికారి బి.రామారావు, గన్నవరం సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆర్.వెంకటరాజు, సీహెచ్‌వో ఎం.ఫణికుమార్, సర్పంచ్ వి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**కంకిపాడు:** ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ తనను భారీ మెజారిటీతో గెలిపించటంతో తనపై మరింతగా బాధ్యత పెరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించిన నిధులను ప్రాధాన్యతా క్రమంలో కేటాయింపులు చేస్తానన్నారు. రహదారులు, పంట కాలువలు, గ్రామాల్లో ఇతర మౌలిక వసతుల కల్పన సమర్ధంగా సాగిస్తామన్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు సాగేలా చర్యలు తీసుకోవటంతో పాటుగా పర్యవేక్షణ వహిస్తామన్నారు. ప్రత్యేకించి కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. పంట కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపడతామని, రైతులు ఎదుర్కొంటున్న ముంపు, సాగునీటి ఇక్కట్లను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్లరవీంద్ర, నాయకులు యలమంచిలి కిషోర్‌బాబు, ధూళిపూడి కిషోర్, బొప్పూడి శివరామకృష్ణ, కొండా నాగేశ్వరరావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

### సీఐ రామారావు బదిలీ

**పెనమలూరు:** పెనమలూరు సీఐగా పని చేస్తున్న టీవీవీ.రామారావు బదిలీ అయ్యారు. ఆయనను ఉయ్యూరు సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. పెనమలూరు సీఐగా టీవీవీ. రామారావు వివాదాలకు దూరంగా పని చేశారు. గత సాధారణ ఎన్నికల్లో పెనమలూరులో ఇరు వర్గాల మధ్య గొడవలు జరిగిన సమయంలో ఆయన నిష్పక్షపాతంగా వ్యవహరించారు. వివాద రహితుడిగా ఇక్కడ పని చేసి ఉయ్యూరు సీఐగా బదిలీ అయ్యారు. పెనమలూరుకు సీఐగా ఇక్కడ ఇంకా ఎవరినీ నియమించకపోవడం విశేషం.

### పింగళి వెంకయ్య జీవితం స్ఫూర్తిదాయకం

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని విజయవాడ రైల్వే డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ రైల్వేస్టేషన్ సమీపంలోని పింగళి వెంకయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం నుంచి నేటి తరం ఎంతో విలువైన పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. అమితమైన దేశభక్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని నిస్వార్థమైన సేవలు అందించారని కొనియాడారు. జాతీయ పతాకం రూపకల్పనలో ఎంతో దూరదృష్టితో సర్వమతాల సమ్మేళనం అని కొనియాడారు. ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



**విజయవాడరూరల్:** విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా బి.సుగుణ నియమితులయ్యారు. ఆమె శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గొల్లపూడిలో ఆర్అండ్ఆర్ నుంచి బదిలీపై రూరల్ మండలానికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో తహసీల్దారు సమావేశం నిర్వహించారు. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన పి.జాహ్నవి కంచికచర్ల మండలానికి బదిలీ అయ్యారు.